# దైవానికి దగ్గరగా

విశాలమైన తోట. ఊరిచివర ఇల్లు. అది సుచరిత మందిరం. రెండంతస్తుల మేడ. చుట్టూ కొబ్బరిచెట్లు. ఆ మేడకు ఉత్తరాన కొంచెం దూరంగా పల్లె. దక్షిణాన కొంచెం దూరాన ఒక పెద్ద కొండ. ఆ కొండను ఆనుకొని విపరీతంగా పెరిగిన చెట్లు. అన్నీ పూలచెట్లే! ఆకు ఒక్కటైనా కనిపించకుండా ఎర్రగా పచ్చగా విరియబూచి ఉంటాయి. దూరాన్నుంచి చూస్తే, అదేదో నందనవనంలా ఉంటుంది. ఆ చెట్ల మధ్యనుంచి ఆ కొండను చుట్టుకుని మెలికలుతిరిగి ప్రవహిస్తుంది మందాకినీ నది.

సుచరితకు ఒకతే కూతురు- తరళ. ఆరు నెలలు దాటని పసిపిల్లను, ఆరులక్షల ఖరీదుచేసే ఆస్తిని, ఆరు సంవత్సరాలైనా సంతోషంగా కాపురంచేయని సుచరితను, ఎవరితోవన వారిని వదలి, మరో లోకంలో తన గమ్యం వెతుక్కోటానికి వెళ్ళిపోయాడు సుచరిత భర్త. దుఃఖాన్ని, ఒంటరితనాన్ని, మాటలురాని పసిపిల్లను గుండెల కదుముకొని కాసులకోసం కాకుల్లాగా ఎగబడిన బంధువులను కనుచూపు దూరంలోనే ఉంచి, ధైర్యంగా జీవయాత్రకు సంసిద్ధురాలైంది సుచరిత. చుట్టుపట్ల ఆరు పల్లెలవరకు వ్యాపించిన పొలాలు సరిచూచుకుంటూ, సుమారు అరవైమంది రైతులను అదుపులో ఉంచుకుంటూ, ప్రాణాలు మాత్రం తరళమీద కేంద్రీకరించి రోజులు దొర్లించింది.

చుట్టూవున్న చెట్లు, కొండలూ తప్ప ఇంక వేరే ప్రపంచం ఏమీలేదన్న భ్రమతో పెరిగింది తరళ. రోజులు గడిచేకొద్దీ ఆమెకు వయస్సు పెరుగుతున్న దేకాని మనస్సు పెరగడంలేదని తోచింది సుచరితకు. ఆమె రంగుబొమ్మలలో తప్ప ఇంక దేనిలోను ఆసక్తి చూపడంలేదని తెలుసుకుంది. ఆమె గదినీ జీవితాన్నీ రంగుబొమ్మలతోనే నింపింది. ఎక్కడెక్కడి నుంచో ఎన్నో బొమ్మలు రకరకాలవి ప్రత్యేకంగా తెప్పించింది. ఒక్కొక్క బొమ్మతోను గంటలు గంటలు మాట్లాడి, దాని రంగులకు మురిసిపోయి, అందానికి పరవశమై రోజులు గడుపుతుంది, తరళ.

ఇప్పుడు గది నిండిపోయింది. మరొక్క బొమ్మవస్తే చోటు చాలదేమో! ఉన్నబొమ్మలు సర్దుకోడంలో మారిపోతాయేమో! తరళ మంచం నాలుగు మూలల్లో బొమ్మలే. కుర్చీనిండా, బల్లమీదా, బల్లక్రిందా, ఎక్కడ చూసినా అవే! కదలలేని నర్తకి బొమ్మ. వాద్యంలేని సన్నాయిమేళం, పూలు పూయని చెట్లతీగెలు, పలకలేని పంజరపు చిలకలు, ఎన్ని బొమ్మలో గదినిండాయి. వాటిని తుడవడము, రకరకాలుగా అలంకరించడము తరళకు తీరికలేని పని! అంతసేపూ వాటితో మాట్లాడుతూనే ఉంటుంది. సమాధానాలు వాటి బదులు తానే చెప్పుకుంటుంది.

ఎప్పుడో ఒక్కక్షణం అలసిపోయి దక్షిణంవేపు కిటికీ తెరుచుకుని అక్కడ కూర్చుంటుంది. దూరాన పూలచెట్లు,

మలుపుతిరిగిన మందాకిని ఏదో మనోహరంగా దగ్గరకురమ్మని పిలుస్తున్నట్లుంటాయి. అది చూడగా చూడగా తరళకు అక్కడకువెళ్ళి ఆడుకోవాలని ఆత్రుత కలుగుతుంది. అయినా ఆమెకు ఇల్లువదలి వెళ్ళడానికి భయము. అక్కడినుంచే కనిపించినంత వరకూ ఆ సుందరదృశ్యం చూస్తూ ఊరుకుంటుంది.

ఆ చెట్ల మధ్యలో కొన్నాళ్ళుగా ఒక కుటీరం ఏర్పడింది. తపస్సు చేసుకోడానికి తగిన స్థలంకోసం వెతుక్కుంటున్న సుందరగిరి స్వామికి ఇది అతి సుందరమైన స్థలంగా గోచరించింది. ప్రక్కనే పారుతున్న నది. ఏకాంతానికి ఏకైకంగా హామీ ఇస్తున్న పర్వతశ్రేణి, ప్రశాంతమైన పూలచెట్లు, భగవంతునితో సాన్నిధ్యం ఇక్కడ కాకపోతే మరెక్కడ సాధ్యమౌతుంది? మరో ఆలోచన లేకుండా సుందరగిరి ప్రశాంతి కోసం ప్రయాణం అక్కడ ఆపి నివాసం ఏర్పరచుకొన్నాడు. ఉదయాన, సాయంత్రం, నదిలో స్నానంచేసి, రాలినపూలు పూజకు ఏరుకుని, భగవద్ధ్యానంలో కన్నులు మూసుకొని కాలంగడపడం అతని నిత్య చర్య.

అలవాటుపడిన దృశ్యాన్ని ఆదరంతో చూస్తున్న తరళ, అనుకోకుండా అక్కడ ఒక కుటీరాన్ని, కావిబట్టలతో కదలకుండా కూర్చున్న సుందరగిరిని ఒకరోజు చూచి ఆశ్చర్య పడింది. అతను ఎంతసేపు ఆసనం వేసుకొని కదలకుండా కూర్చున్నాడో, ఆమె అంతసేపు కిటికీ ఊచలుపట్టుకొని కదల కుండా అతనిని చూస్తూ కూర్చుంది. ఆ తరువాత ప్రతిరోజూ అలా చూడడమే పని అయింది. కొన్నాళ్ళకు అక్కడకు వెళ్ళి

అతనితో మాట్లాడాలనిపించింది. ఆకోరిక అణచడానికి అశక్యమైంది. దాంతో భయం పోయింది. అనుకోకుండా ఒక రోజు ఆమె తలుపు తెరుచుకు బయటకు వెళ్ళింది. వెనుకనుంచి చూస్తున్న సుచరిత తెల్లబోయింది. అయినా ఆమెను ఆపలేదు.

తరళ కుటీరం దగ్గరకు వెళ్ళేటప్పటికి సుందరగిరి ధ్యానమగ్నుడై ఉన్నాడు. ఆమె కాలితో కదపిన రాలిన పండుటాకులు గలగల మన్నాయి. అతను కన్ను తెరవలేదు. ఆమె అతనికి ఎదురుగా ఒత్తుగా రాలిన ఆకులమీాద కూర్చుంది, అతనినే తదేక ధ్యాసతో చూస్తూ తానుకూడా ధ్యానమగ్న అయినట్లు! నిముషాలు, గంటలు గడిచాయి. అతను చలింపలేదు. ఆమె చలించింది. ఎదుటఉన్న మనిషిని ఎంతసేపైనా చూడని ఇంత నిద్ర ఏమిటి అనుకుంది వింతగా!

అక్కడినుంచి లేచిపోయింది. నదిఒడ్డుకు వెళ్ళింది. చల్లని నీటిలో కాళ్ళు తడుపుకుంది. ముఖం కడుక్కుంది. నది అంచునే చాలా దూరం నడిచింది. గాలికి కదలి రాలిన పూలన్నీ రంగురంగులవి ఏరుకుంది. కొండదగ్గరకు చేరుకుంది. ఇంక ముందుకు దారిలేదు. అంత దగ్గరగా ఆ కొండ ఎంతో గంభీరంగా, ఎత్తుగా ప్రపంచాన్నంతా ఆక్రమించుకుని, దాట శక్యంకాని కోటగోడలావుంది. తరళ తలపైకెత్తి చూచింది. దాని శిఖరం ఎంతో ఎత్తున ఉంది. అలా దాన్ని చూడడానికి ప్రయత్నించడమే శ్రమగాఉంది. ఆ కొండ తాను ఎప్పుడైనా ఎక్కగలదా? ఆ అంచున ఏమివుంటుంది?– అనుకుంది. మళ్ళా వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది.

కుటీరందగ్గరకు వచ్చింది. అప్పటికి సుందరగిరి ధ్యానం ముగిసింది. పూజాపాత్రలేవో తుడుచుకుంటున్నాడు. తరళ వెళ్ళి అతని ఎదుట నిలబడింది. అతను ఆమెను కూర్చోమనలేదు. "ఎవరు నువ్వు? ఎందుకు వచ్చావు?" అని అడుగలేదు. తనపని తాను చేసుకుంటూ ఆమెను చూస్తూ ఊరుకున్నాడు. తరళకు ఏంచెయ్యాలో తోచలేదు. ఒక్కక్షణం వెరగుపడి నిలుచుంది. మళ్ళా అనుకోకుండా తాను ఏరితెచ్చినపూలు అతని ముందర ఉంచింది. అతనికి వంగి నమస్కారం చేసింది భయంతో. అతని పెదవులపై సన్నని చిరునవ్వు విరిసింది. అది ఇంక అలానే ఉంది.

తరళ ధైర్యంతెచ్చుకుని అతనికి కొంచెం దూరంగా కూర్చుంది. తానే మాటలు ప్రారంభించింది. తన సంగతి చెప్పింది. "అదుగో, ఆ దూరాన కనిపిస్తున్నదే, ఆ మేడలో నుంచి వచ్చాను; అదే మా ఇల్లు" అన్నది. అతను జవాబు చెప్పలేదు.

"నా పేరు తరళ, మా అమ్మపేరు సుచరిత. ఇవిగో ఈ చుట్టూ కనిపించే పొలాలన్నీ మావే! అదుగో అక్కడ ఆవేపున పల్లె కనబడుతోందిగా! అక్కడే మా రైతులంతా ఉన్నారు" అన్నది. సుందరగిరి నవ్వుతూ ఊరుకున్నాడు. తరళ ఊరుకోలేక మళ్ళా మాట్లాడింది: "అదుగో ఆమూల కనిపిస్తోందే ఆ గది నాదే. నాకు రకరకాల బొమ్మలున్నాయి. చిన్నవి, పెద్దవి, రంగువి, తెల్లవి. వాటితో నాకు రోజుగడచిందే తెలియదు." అన్నది.

సుందరగిరి నవ్వాడు. పూజాపాత్రలు సర్దిపెట్టి కుటీరంలో గాలికి ఎగిరివచ్చిన ఆకులు ఏరాడు. అతను ఏదైనా మాట్లాడుతాడేమోనని తరళ ఒక్కక్షణం ఆగింది. అతను పెదవి కదపలేదు. ఆమె అతనివేపు బెంగగా చూసింది. మళ్ళా తానే మాట్లాడింది: "ఆగది కిటికీలోనుంచి ఇక్కడ చెట్లు, నదీ అన్నీ కనిపిస్తాయి. నేను రోజూ తోచనప్పుడల్లా చూస్తూ ఉంటాను. కొన్నాళ్ళగా మీరు ఒక్కరే ఇక్కడ కూర్చుని కనిపిస్తున్నారు, మీకు ఏమీతోచదేమో! మీతో మాట్లాడాలనివచ్చాను. నాకూ తోచదు, ఒక్కొక్కసారి" అన్నది. దిగులుగా. అతను నవ్వాడు. ఈ సారి మాట్లాడాడు, "తోచకపోతే ఆవేపు వెళ్ళాలి. ఆ పల్లెలో ఏవో జాతరలు ఎప్పుడూఉంటాయి: కావలసినంత కాలక్షేపం" అన్నాడు. తరళ తెల్లపోయింది. విసుగుతో జవాబు చెప్పింది. "ఆ గొడవ నాకు నచ్చదు. ఎప్పుడో ఒకసారి వెళ్ళాను. ఆ డప్పులు, మేళాలు నాకు భయం" అన్నది దిగులుగా. అతను మాట్లాడలేదు. చెట్ల కొమ్మలమీద ఆరవేసిన శాటీలు ఏరుకుని మడతలు పెట్టాడు. తరళ మళ్ళీ ఎన్నో ప్రశ్నలు వేసింది, అతనిని గురించి. "ఇక్కడికి ఎందుకు వచ్చారు? ఇలా ఒంటరిగా ఎందుకున్నారు ? ఎందుకలా, ఎప్పుడూ కళ్ళు మూసుకునే ఉంటారు? ఇక్కడ మీకు భయం వెయ్యదా?" ఇలా ప్రశ్నలధార కురుస్తూనేఉంది, ఎడతెగకుండా, క్షణం ఆగకుండా. సమాధానాలు రాలేదు. తరళ వాటికోసం ఆగనూలేదు. సుందరగిరి బట్టలు తీసుకుని మౌనంగా నదివేపు నడిచాడు స్నానానికి. తరళ బెంగగా అడిగింది: "రేపు

నేను మళ్లా రానా?" అని. వెళ్ళిపోతున్న అతనికి ఆ మాట వినిపించిందో లేదో! అతను తిరిగి చూడలేదు. ఆమె వెళ్లి పోయింది. ఎవరూ దగ్గరలేని అడవిచెట్లను అస్తమిస్తున్న సూర్యునికాంతి ఆక్రమించుకుంది.

మర్నాడు మళ్ళీ తరళకు అక్కడికి వెళ్లాలనిపించింది. ఇంట్లో కాలు నిలువలేదు. బొమ్మలతో ఆడుకోడానికి బుద్ధి పుట్టలేదు. కిటికీలో కూర్చుని అతనినే చూస్తున్న తరళకు దిగులు పట్టుకుంది. అతనికి వండిపెట్టే వారెవరూ లేరుగదా - ఏం తింటాడు? అని ఆలోచించింది. వెంటనే అతనికి పళ్ళయినా ఇస్తే బాగుండు ననిపించింది. దాంతో ఉత్సాహంగా లేచి సుచరిత దగ్గరకు వెళ్ళింది.

"అక్కడ నది దగ్గర ఒక కుటీరంలో ఒక స్వామి ఉన్నాడు. ఆయనకు భోజనం వండిపెట్టడానికెవరూ లేరు. పళ్ళు తీసుకువెళ్ళి ఇస్తాను" అన్నది. ఇన్నాళ్ళకు తరళకు ఇల్లు కదలాలనిపించినందుకు, ప్రాణంలేని బొమ్మలను వదలి ప్రాణం గలవ్యక్తిలో ఆసక్తి కలిగినందుకు సుచరితసంతోషించింది. చిన్న బుట్టతో పళ్ళు ఇచ్చింది. తరళ అవి తీసుకు వెళ్లింది.

సుందరగిరి మామూలుగా ధ్యానంలో ఉన్నాడు. తరళ ఓపికగా ఎదురుచూస్తూ కూర్చుంది, ఎప్పుడు కళ్ళు తెరుస్తాడా అని. పళ్ళబుట్ట ప్రక్కన పెట్టుకొని, రాలిన పండుటాకులు మడత లుపెట్టి గిల్లిపోసింది. కళ్ళు తెరచాడు. ఆమెను చూచి ఆశ్చర్యపడలేదు. ఆదరించలేదు. నిర్లిప్తంగా కమండలంలోని నీళ్ళతో కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కున్నాడు. పళ్లెంలో

ఉన్న పూలుతీసి కుటీరంలో ఉన్న శివలింగంముందు ఉంచి నమస్కరించాడు. తరళ కొంచెం ధైర్యంచేసి దగ్గరకు వచ్చింది.

"మీ కోసం పళ్ళు తెచ్చాను" అన్నది వినయంగా. అతను చిరునవ్వుతో అందుకున్నాడు. భక్తితో భగవంతునికి నైవేద్యం పెట్టి పక్కన పెట్టాడు. తరళ నిరుత్సాహపడింది. "అవి మీరు తినాలి" అన్నది. అతను నవ్వుతూ "సరే"అన్నాడు. అంటే ఆమె శ్రమపడి అవి తెచ్చినందుకు అతను సంతోషించనూ లేదు, అవి తిరస్కరించనూ లేదు. అదేదో అతిసహజమైనదిగా ఊరుకున్నాడు. కాసేపటికి తరళ లేచి వెళ్ళిపోయింది. సుందరగిరి ఆమె తెచ్చిన బుట్ట ఖాళీచేసి ఇచ్చాడు.

ఆ తరువాత తరళ రోజూ వచ్చేది. రోజూ అతనికి పళ్ళు తీసుకురావడము, రావడానికి ఒక మిష అయింది.

ఆమెకు నిద్రలేచినది మొదలు ఎప్పుడు కుటీరానికి వెడదామా అన్నదొక్కటే ఆలోచన! ఆమె బొమ్మలను దులపడం కూడా మర్చిపోయింది.

కుటీరానికి వెళ్ళాక అతను ధ్యానంలోనుంచి లేచేవరకు అక్కడే ఉండేది. అతను ధ్యానంలో ఉన్నంతసేపు తాను నీళ్ళల్లో నదిబడ్డున ఆడుకునేది. అతను ఎప్పుడూ ఆమెతో ఆప్యాయంగా మాట్లాడలేదు. అతని పెదవులమీద చిరునవ్వు ఎప్పుడూ చెరగనూ లేదు. ఆమె ఏదో మాట్లాడుతూ ఉండేది: "నిన్న తెచ్చిన పళ్ళు బాగున్నాయా? మా తోటలో అరటిగెల ఇంకా పండలేదు. ఈ నారింజపళ్ళు కూడా మా చెట్టువే."

"మీ రెప్పుడైనా మా ఇంటికి వస్తారా? మా అమ్మ పిలవమంది, మీకు నా బొమ్మలు చూపిస్తాను." ఇలా ఓపిక ఉన్నంతవరకు మాట్లాడుతుంది. అన్ని మాటలకు చిరునవ్వొక్కటే అతని సమాధానం! బొమ్మలతో ఆడుకునే పసితనం ఆమెకింకా వదలలేదు! ఆమెతో ఏమి మాటలు! అతని నిశ్చలత సడలలేదు.

ఒకరోజు తరళ ముందుగానే వచ్చింది. ఎంత ప్రొద్దు పోయిందో ఆమెకు తెలియలేదు. నిద్రకళ్ళు తెరచినది మొదలు మనసు కుటీరం దగ్గరే వాలి ఉంటే, ఉండలేక సుచరితతో కూడా చెప్పకుండా మూలనున్న పళ్లబుట్ట తీసుకు పరుగున వచ్చింది. బుట్టలో పళ్ళు లేవని కూడా చూడలేదు. కుటీరం దగ్గరకు వచ్చి ధ్యానంలో మునిగిన సుందరగిరి మూసిన కన్నులు చూచేవరకు స్ఫురించలేదు, "ఎందుకింత ఆత్రం!" అన్నమాట. బుట్ట మూలన పెట్టి నిరుత్సాహంతో కూర్చుంది. అప్పుడు చూసింది ఖాళీ బుట్ట తెచ్చానని. అంత కంగారుగా అది ఎందుకు తేవడం? ఆమెకు నవ్వు వచ్చింది. రోజూ తాను పళ్లు తెస్తే అతను సంతోషిస్తున్నాడో లేదో. తెచ్చానన్న తృప్తి మాత్రం తనకు ఇవ్వాళ ఎందుకు వచ్చినట్లు!

ఆ వేళ నదిఒడ్డుకు వెళ్లడానికి బుద్ధిపుట్టలేదు. చుట్టూ ఉన్న చెట్లకేసి చూడడానికి ఉత్సాహం లేదు. గాలికి కదలి చల్లగా ఒడిలో వచ్చి రాలుతున్న పూలకేసి చూడలేదు. పరధ్యానంగా వాటిని తీసి అవేమిటో కూడా చూడకుండా దూరంగా విసరి వేసింది. చలనం లేకుండా అలాగే చాలాసేపు కూర్చుంది.

మామూలు వేళ దాటిపోయినా అతను కన్ను తెరవలేదు. అప్పటికి తరళ మనస్సు వికలమయింది.

ఇక్కడికి రావాలని ఎందుకూ తపన! ఇంట్లో కాలు నిలువక దేనికి రావడం! తనను రమ్మని ఎవరూ పిలవలేదు. తనే వచ్చింది. వచ్చిన తనను ఎవరూ ఉండమనలేదు. తానే కూర్చున్నది. తనతో ఎవరూ మాట్లాడలేదు. తానే మాట్లాడింది. తాను ప్రశ్నలు వేస్తూనే ఉంది. సమాధానాలు ఎవరూ చెప్పలేదు. అయినా రోజూ ఇక్కడకి రావాలని ఆరాటం ఎందుకో?

ఆవేళ ఇంట్లోనుంచి తొందరతొందరగా వస్తుంటే పరికిణీ అంచుతగిలి ఒక కొయ్యబొమ్మ తూలిపడింది. ఆ బొమ్మ కొనవేళ్ళు పరికిణీ అంచులో చిక్కుకొన్నాయి. మెల్లిగా వదల్చుకొని రావటానికి పదినిమిషాలు పట్టింది. ఆ బొమ్మ నిండా దుమ్ము నిండివుంది. తాను తుడిచి చాలారోజులైంది. పరధ్యానంగా అన్ని బొమ్మలకేసి ఒక్కసారి చూసింది. అన్నీ జాలిగా తనకేసి చూస్తున్నట్లుంది. నిర్లక్ష్యంగా తాను వచ్చేసింది.

అది గుర్తువచ్చి ఏదో బాధగావుంది. మళ్లా తనబొమ్మలతో విధివిరామం లేకుండా ఆడుకోవాలనిపిస్తోంది. కుటీరానికి రావాలన్న కుతూహలమో, చపలత్వమో, దానంతటదే వదలింది. ఈ అడవి నచ్చలేదు. ఈ ధ్యాన సమాధి అర్థంకాలేదు! ఇదొక లోకం, తనదొక లోకం! ఖాళీబుట్ట తీసుకు లేచింది, వెళ్ళిపోదామని.

అప్పుడే నిద్రలేచిన మనిషిలా సుందరగిరి కన్ను తెరచి చూశాడు. వెళ్లిపోతున్న తరళ వెనక్కు తిరిగి చూచి క్షణం ఆగింది. "నేనువచ్చి చాలాసేపైంది, వెళ్లిపోతున్నాను" అన్నది. మళ్లా దగ్గరకువచ్చి అన్నది: "చాలా రోజులుగా నా బొమ్మలు చూడడం లేదు. అవి నాకోసం బెంగపెట్టుకున్నాయి" అని.

సుందరగిరినవ్వుతూ ఊరుకొన్నాడు. తరళమళ్లా అన్నది. "ఇవ్వాళ పొరపాటుగా ఖాళీబుట్ట తెచ్చాను. పళ్ళు లేవని చూడ లేదు. తీసుకుపోతున్నాను" అంది దిగులుగా. మళ్ళీ అతను నవ్వుతూ ఊరుకున్నాడు. మళ్లా ఆమె తనలో తాను గొణుగుతున్నట్టు అన్నది:

"అప్పుడప్పుడూవచ్చి మీ ధ్యానానికి భంగం కలిగించానేమో! ఇది మంచిది కాదేమో! స్నేహంకోరని మీతో స్నేహం చేసుకోవాలనుకోడం!" ఆమె కళ్లల్లో నీళ్లు కనిపించాయి. అతనికి వంగినమస్కారం చేసింది. మొదటిరోజు వచ్చినప్పుడుతప్ప మళ్ళీ అతనికెప్పుడూ నమస్కరించలేదు. బొమ్మలతో ఆడుకొన్నట్లే అతనితో చనువుగా నిర్లక్ష్యంగా ఏదో వాగుతోంది. సుందరగిరి కళ్లలో కరుణ కనుకొలకుల్లోనే ఉండిపోయింది. అతను మెల్లగా అన్నాడు "నీవు సుఖంగా ఉంటావు" అని. తరళ తెల్లపోయింది. ఇది ఆశీర్వాదమా! అనురాగమా! సుఖము ఉండడము, లేకపోవడము కూడ ఆమెకు అంతగా తెలియదు. ఆమె వెళ్ళిపోయింది.

ఇంటికి వెళ్ళగానే గది తలుపులు గట్టిగా వేసుకుంది. మళ్ళీ ఎప్పుడైనా బయటకు వెళ్ళదామనిపిస్తుందేమోననే

భయంతో. ఆ మూతబడిన తలుపు చప్పుడు విని సుచరిత నిట్టూర్చింది. మనస్సులో కూతుర్ని కావిలించుకుంది.

వేసుకోడానికి ఏతలుపులూ లేని సుందరగిరి నిశ్చలంగా కూర్చున్నాడు. ఆతని మనస్సులో తరళ వెళ్ళిపోయిందని విచారంగాని, జాలిగాని లేదు. ఎందరో మనస్సు ఎరగనిమనుష్యులు! జాలి అంటే మళ్ళీ బాధ. మళ్ళీ బంధనం! ఎందరో ఆశా నిరాశల పెనుగులాటతో సతమత మయ్యేది! ఎవరికి వారే తెప్పరిల్లుకోవాలి. గమ్యమేదో! మార్గమేదో ఎప్పుడో తామే తెలుసు కోవాలి!

కల్లమైన బ్రతుకులో కలల భారాన్నికూడా వదలక పోతే విముక్తి ఎప్పుడు? ఆశ, నిరాశ, సుఖము, దుఃఖము, కలలు, కన్నీళ్ళు,– మళ్ళీ ఈవలయంలోనే చిక్కుకొంటేదాటి వెళ్ళే దెప్పుడు?

గాలికి కాస్సేపు ఆకులు కదులుతాయి, ఆగుతాయి. దానివల్ల చెట్టు కదిలిపోదుకదా! నీటి మీద అలలులేస్తాయి. అణుగుతాయి. నది కలగిపోదు కదా! కాలానుగుణంగా ఋతువులు వస్తాయి, పోతాయి. ప్రకృతి చెదరిపోతుందా?

ఎటువంటి చలనము, మమకార వికారములులేని మన స్థితి దేవత్వమా? జడత్వమా? వినిర్మలమైన ఆకాశం కేసి చూచినప్పుడు అతని మనస్సులో ఎటువంటి సందేహమూ లేదు.

అతను నదిబడ్డుకు వెళ్ళాడు స్నానానికి, కావిరంగుశాటి చేత పట్టుకుని. అప్పటికి చీకటిపడి చంద్రోదయం మైంది. పచ్చని వెన్నెల కాంతులు నీటి తరగలతో కలిసి ఆడుకుంటు

న్నాయి. చెట్లన్నీ బంగారుమయమైనాయి. ఆ వెన్నెల్లో, ఆ చల్లని నీటిలో స్నానమెంతో ఆహ్లాదకరంగా ఉంది. ఒక్కొక్క మునకా దైవానికి దగ్గరగా ఒకొక్క అడుగు ముందుకు వేసిన ట్టుంది. ఆ నీటిలోనే ఏదో అలసిపోయినట్టు నిద్రముంచుకు వచ్చింది. హృదయం మళ్ళీ ధ్యాన సమాధికి ఉన్ముఖమైంది.

మనస్సులో ఏవో మాటలు మెదిలాయి.

"నిద్రా సమాధి స్థితః
సంచారః పదయోః ప్రదక్షిణ విధిః
స్తోత్రాణి సర్వాగిరః
యద్యత్కర్మ కరోమి
తత్తదఖిలమ్ శంభో
తవా రాధనమ్"

ప్రతి క్షణము, ప్రతి కార్యము భగవంతుని మయమైన జీవిత మెంత మధురము ! ... చన్నీటిలో తడిసిన అతని మేను చల్లగాలికి పులకరించింది.